క్లుప్తంగా

వనమహోత్సవానికి రావాలని మంత్రికి ఆహ్వానం



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్లగూడెం): మాలమహానాడు ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించే వనమహోత్సవానికి రావాలని మంత్రి వివేక్‌కు ఆహ్వానం పలికింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సంఘ సభ్యులు కలిసి మంత్రికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో మాలలు ఎవరికి వారుగా సొంత సంఘాలు ఏర్పాటు చేసుకుని నాయకత్వానికి మాల మహానాడు పేరుమీద కార్యక్రమాలు నిర్వహించడంతో భవిష్యత్‌లో మాలల ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ వలన మన విద్యార్థులకు మాల ఉద్యోగులకు రోస్టర్ పద్ధతి ద్వారా తీరని అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఎక్కువ మొత్తంలో ప్రతిష్టించాలని, ఎస్సీ వర్గీకరణను రద్దు చేసే వరకు ఉద్యమించాల్సిందిగా వారు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో గుంతెటి వీరభద్రం, రాష్ట్ర అధ్యక్షుడు తలమల హసేన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరివి దయానంద్, మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు వెంకటేశ్వర్లు, సాలె నితీష్ కుమార్, శ్రీనివాస్ అన్నారు.

నేటి నుంచి ఏదులాపురంలో ప్రజావాణి

ఖమ్మంరూరల్: ఇటీవల నూతనంగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో నేటి నుంచి ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, మున్సిపల్ పరిధిలోని 32 వార్డుల్లో ప్రజలు సమస్యలను నేరుగా చెప్పుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: అనాథ శవానికి అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం రైల్వే పోలీస్‌పరిధిలోని మల్లెమడుగు రైల్వేస్టేషన్ దగ్గర గుర్తుతెలియని వృద్ధుడు రైలు ఢీ కొని మృతి చెందగా మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చరీకి తరలించి భద్రపరిచారు. మృతదేహం కోసం ఎవరూ రాకపోవటంతో రైల్వే పోలీసులు ఫౌండేషన్‌కి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	మహావతార్ నర్సింహా
సాయిరాం	మేఘాలు చెప్పిన ప్రేమకథ, పరదా
ఆదిత్య	స్టాలిన్
శ్రీనివాస	వార్ 2

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	150		20
బీర	46	తోటకూర	4
దొండ	36		20
పొట్లకాయ	46	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		25
చామగడ్డ	36	పుదీన	1
క్యారెట్	50		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

ఈ కష్టాలు తీరేదెన్నడు..?

వాగులు పొంగితే రాకపోకలు బంద్!

- హై లెవల్ కాజ్‌వేలు లేక తప్పని తిప్పలు



కొత్తూరు వద్ద వాగు ఉధృతి (ఫైల్)

కూసుమంచి: వాగులు ఉప్పొంగితే ఆయా గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వారు ఎన్ని పనులున్నా ఇళ్లకే పరిమితం కావాలి. వాగుల ప్రాంతంలో హైలెవల్ కాజ్‌వేలు లేకపోవటంతో ఆయా గ్రామాల నడుమ రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఈ కష్టాలు ఏళ్ల తరబడి ఉన్నా పాలకులు పట్టించుకోవటం లేదని ఆయా గ్రామాల ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం వచ్చిన భారీ వర్షాలకు వాగులు పొంగటంతో ప్రజలు కష్టాలు పడాల్సి వచ్చింది. ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించి తమ సమస్యలను తీర్చాలని ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగొస్తే ఇక్కట్లే..

మండలంలోని నర్సింహులగూడెం–కొత్తూరు రోడ్డులో వాగుపై హై లెవల్ కాజ్‌వే లేక వర్షాలు వచ్చినప్పుడు వరదనీరు రహదారిని ముంచెత్తటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ ప్రాంతంలో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాకాలం వరిపొలాల గుండా వరద ఉధృతంగా వస్తుండగా వాహనాలు కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి. ఈ రోడ్డులో కొత్తూరు, ఎర్రగడ్డతండాలో పాటు సమీప సూర్యాపేట జిల్లాకు రవాణా సౌకర్యం ఉండటంతో బస్సులు, బడి వ్యాన్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. పలువురు వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనుల నిమిత్తం వెళ్లి వచ్చేవారు వాగుదాటుతుంటారు. రైతులు పొలాలకు వెళ్లాలంటే ఈ వాగు దాటాల్సిందే.

కాజ్‌వే నిర్మించినా అవే సమస్యలు..

నానుతండా వద్ద పాలేరు–బంగ్లా రోడ్డులో ఇటీవల భారీ వర్షాలకు వాగు వద్ద రహదారి కూడా కొట్టుకుపోగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ పాలేరు రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ ఉధృతి ఉన్నప్పటికీ లో లెవల్ కాజ్‌వేతోనే సరిపుచ్చారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పాటు చౌటపల్లి గ్రామ శివారులోని బీరోలు రోడ్డులో ఉన్న వాగు వద్ద ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వర్షాలకే ఇక్కడ వాగు రోడ్డు మీదుగా ప్రవహిస్తుంది. ఈ నీటి ప్రవాహంలో 2022లో ఓ ట్రాక్టర్ కొట్టుకపోతుండగా స్థానికులు కాపాడారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు కాజ్‌వే నిర్మించకపోవటంతో కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక నర్సింహులగూడెం గ్రామం వద్ద కిష్టాపురం రోడ్డులో గత ప్రభుత్వంలో కొత్తగా లో లెవల్ కాజ్‌వే నిర్మించారు. కాగా వాగు ఉధృతంగా ప్రవహిస్తే కాజ్‌వే మునిగి ఈ రోడ్డులో కూడా రవాణా స్తంభిస్తుంది. ఇక్కడ కూడా హై లెవల్ కాజ్‌వే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సింహులగూడెం వద్ద కాజ్‌పై నుండి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

కష్టాలు పడుతున్నాం..

నర్సింహులగూడెం–కొత్తూరు గ్రామాల మధ్య హై లెవల్ కాజ్‌వే లేక వర్షాలు వచ్చినప్పుడు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. వాగు ఉధృతంగా వస్తే ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంది. హై లెవల్ కాజ్‌వే నిర్మించి కష్టాలు తీర్చాలి

– రావు ఉపేందర్‌రెడ్డి, కొత్తూరు

కాజ్‌వే ఎత్తు పెంచాలి..

మా గ్రామం, కిష్టాపురం గ్రామాల వద్ద కాజ్‌వే నిర్మించినా ఎత్తు తక్కువగా ఉండటంతో వాగు వచ్చినప్పుడు మునిగిపోతుంది. రైతులు పొలాలకు వెళ్లటం కష్టం అవుతుంది. కాజ్‌వే ఎత్తు పెంచితే బాధలు పోతాయి.

– బోయిన కృష్ణ, నర్సింహులగూడెం

‘పర్ణశాల’ అభివృద్ధికి కసరత్తు

- రూ 1.14 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు



ఇందిరానగర్‌లోని పర్ణశాల రామాలయం

ఖమ్మం అర్బన్ : నగరంలోని ప్రసిద్ధిగాంచిన ఇందిరానగర్ పర్ణశాల రామాలయం అభివృద్ధికి దేవాదాయ శాఖ కసరత్తులు ప్రారంభించింది. సుమారు రూ.1.14 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేసి, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. భద్రాచలం రామాలయం తరహాలో నిత్యం వేడుకలు, సీతారాముల కల్యాణం వంటి ఉత్సవాలు జరగడంతో ఈ దేవాలయం విశేష ప్రాచుర్యం పొందింది. నగరంలోని 10వ డివిజన్‌లో ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో ప్రతీరోజు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధులతో మూడు అంతస్తుల రాజగోపురం, చుట్టూ ప్రహరీ, ప్రధాన మండపం పునర్నిర్మాణం, ఫ్లోరింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. వచ్చే రెండు మూడు నెలల్లో నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్టు సమాచారం. దేవాలయం అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తే భక్తులతో ఇప్పుడు వస్తున్న దానికంటే రెట్టింపు స్థాయిలో దర్శనాలతో నిత్య సందడి నెలకొనే అవకాశం ఉంది. నిధులు మంజూరి అయిన టెండర్ల ప్రక్రియతో ఈ పనులు పూర్తయితే నగరంలో పర్ణశాల రామాలయం మరింత అందంగా తీర్చిదిద్దబడటమే కాకుండా, భక్తుల రాకపోకలు పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశంలో ఎన్‌ఆర్‌సీ తీసుకొచ్చే ప్రయత్నం



మాట్లాడుతున్న అబ్బాస్

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో ఎస్ఐఆర్ పేరుతో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని తీసుకొచ్చి మైనార్టీ, దళిత, ఆదివాసీల ఓట్లను తీసేసే కుట్రలను కేంద్ర ప్రభుత్వం చేస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి నగరంలోని మంచికంటి హాల్‌లో ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ ప్రత్యేక ఓటర్ సవరణ లోపాలు, రాజ్యాంగ పరిరక్షణ అనే అంశంపై ఎంఏ.జబ్బార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో ఎన్ఆర్‌సీని తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని, ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ దాష్టికం చేస్తుందని, ఇప్పటికే బీహార్‌లో 22 లక్షల మహిళా ఓటర్లను, అందులో ముస్లిం, దళిత, ఆదివాసీ మహిళల ఓట్లను తొలగించారన్నారు. ఇప్పటికే దేశంలో బీజేపీ ప్రభుత్వం ఓట్లను దొంగలించి, గద్దెనెక్కి ప్రజల మీద నల్ల చట్టాలు తీసుకొచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్‌ను మోదీ గుప్పిట్లో పెట్టుకున్నారు. ఈ సమావేశంలో ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి.అబ్బాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బిచ్చల తిరుమలరావు, ప్రముఖ వైద్యులు గోపీనాథ్, డాక్టర్ ఆరిఫ్, ప్రముఖ విద్యావేత్తలు రవి మారుతి, ఐవి రమణారావు, జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం కార్యదర్శి ఎస్కే కాసిం, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అసద్, బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షులు తాజుద్దీన్, సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్లగూడెం): మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు గజవెల్లి సత్యనారాయణ కోరారు. ఆదివారం ఖమ్మం జిల్లా పెరిక (పురగిరి క్షత్రియ)సేవా సంఘం ద్వారా కానుగంటి శ్రీనివాస్ హైదరాబాద్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ఎలక్ట్రిక్ కుట్టుమిషన్లను ఖమ్మం సంఘ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెరిక కులంలో పేద కుటుంబాలకు ఆర్థికంగా వారు ఎదగటానికి తమవంతు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు బంధు సూర్యం, ప్రధాన కార్యదర్శి చింతల లింగేశ్వరరావు, అధికార ప్రతినిధి సోమిశెట్టి వెంకటేశ్వరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ముత్తినేని రత్నాకర్, గౌరవ సలహాదారులు బెడద సత్యనారాయణ, పత్తిపాక రమేష్, నల్లపు శ్రీను, కార్పొరేటర్ గజ్జల లక్ష్మి, వెంకన్న, పత్తిపాక లత, చిత్తలూరి జయమ్మ, బసవ వీర బాబు, వాసంశెట్టి భరత్, కీత వేణు పాల్గొన్నారు.

సోమలింగేశ్వరస్వామి దేవాలయానికి విరాళం



గ్యాస్‌స్టవ్, సిలిండర్ వితరణ చేస్తున్న దాతలు

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్ గుట్టపై శ్రీగిరి పర్వతంపై వెలసిన స్వయంభు శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ సోమలింగేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఈ మేరకు మంచుకొండకు చెందిన మాజీ ఆత్మకమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్ గ్యాస్‌స్టవ్, సిలిండర్‌ను విరాళంగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు ఆయన సేవాభావాన్ని కొనియాడారు.

రైతులకు యూరియా అందించాలి

తిరుమలాయపాలెం: రైతాంగానికి అవసరమైన యూరియాను అందించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం, పత్తి, వరి పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పనిచేస్తున్న రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి ఎరువుల కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

తుమ్మలను కలిసిన స్తంభాద్రి ఉత్సవ కమిటీ



జ్ఞాపిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: గణేష్ ఉత్సవాల నేపథ్యాన స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు ఆదివారం ఖమ్మంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి వినాయక చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వినోద్ లాహోటీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖకు ఆదేశాలు జారీ చేసిందని వివరిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ నిమజ్జనం రోజున గాంధీచౌక్‌లో నిర్వహించే వేడుకలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధు రమేష్ రెడ్డి, స్తంభాద్రి ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గెంటేల విద్యాసాగర్, కార్యదర్శి కీసర జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన డ్రైవర్లకు సన్మానం



సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరలో ప్లాట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన డ్రైవర్లు బండ్ల నర్సయ్య, మోహన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సలీం, నాయకులు కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

రఘునాథపాలెం: సన్‌రైజ్ అభ్యుదయ సేవా సంస్థ చేపడుతున్న సేవలు ప్రశంసనీయమని తల్లాడ ఎంపీడీఓ ఏనుగు సురేష్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని చింతగుర్తిలో అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలు, ఫ్యాన్, కుక్కర్, ర్యాక్, టేబుల్, వాటర్ క్యాన్ తదితర రూ.15 వేల విలువైన వస్తువులను అందించారు. ఏనుగు కిరణ్‌బాబు జన్మదిన సందర్భంగా ఈ వితరణ చేసినట్లు సన్‌రైజ్ సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతిదాస్, సంస్థ ప్రతినిధులు, అంగన్‌వాడీటీచర్ కవిత, ఆయా తదితరులు పాల్గొన్నారు.



సామగ్రి అందజేస్తున్న సురేష్‌బాబు, తదితరులు

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు వక్తలు అన్నారు. ఖమ్మం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వీధిలోని సంస్థ సేవా కేంద్రంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ దాది ప్రకాష్ మని 18వ స్మృతి దివస్ సందర్భంగా జాతీయ స్థాయి కార్యక్రమంలో భాగంగా ఖమ్మంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు 70 మంది ఈ కార్యక్రమంలో రక్తదానాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి జిల్లా ఇన్‌చార్జి అరుణ, బీకే రమాదేవి, గీత, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం:నగరంలోని 132/33 కేవీ ఖానాపురం సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా సోమవారం ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం టౌన్ డివిజనల్ ఇంజనీర్ నంబూరి రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌టీ, ఇల్లెందు క్రాస్ రోడ్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, బురహాన్‌పురం, దానవాయిగూడెం, గాంధీచౌక్ సబ్ స్టేషన్ల పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్, కవిరాజ్ నగర్, వీడీయోస్ కాలనీ, నెహ్రూ నగర్, న్యూ బస్టాండ్ ప్రాంతం, వైరా రోడ్, బైపాస్ రోడ్, బాలాజీనగర్, లెనిన్ నగర్, బురహాన్‌పురం, మామిళ్లగూడెం, దానవాయిగూడెం, సారథీనగర్, గాంధీచౌక్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

యూరియా కోసం రైతుల అవస్థలు

నేలకొండపల్లి: యూరియా కోసం రైతులు అవస్థలు ప్రభుత్వానికి పట్టటం లేదని రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి పాల్తీయా శ్రీనివాసరావు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాల మధ్య వైరం రైతులపై కక్ష తీర్చుకుంటున్నారని, అన్నదాతలు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. కానీ రైతులకు సరిపడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. యూరియా ఇబ్బందులు తొలగించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాని విజయవంతం చేయాలన్నిరు. ఈ సమావేశంలో రైతు సంఘం సభ్యులు మల్లేబోయిన ఉపేందర్, కాశిబోయిన అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు ప్రదానం



కథలు, కవితల సకలనాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: పురిమళ్ల ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సాహితీవేత్తలకు, రచయితలకు పురస్కారాలను ప్రదానం చేశారు. రచయిత, కవి మాల్యశ్రీకి బోగోజు సముద్రమ్మ–పురుషోత్తం స్మారక పురస్కారాన్ని అందించి సాహితీవేత్తలు సత్కరించారు. వివిధ స్థాయిల్లో నిర్వహించిన కథలు, కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పురస్కారాలు అందించారు. బాల సాహిత్యంలో రాణించి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని సన్మానించారు. నామా పరుషోత్తం అధ్యక్షతన జరిగిన సంస్థ 7వ వార్షికోత్సవంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహుమతులకు ఎంపికైన కథలు, కవితలతో రూపొందించిన సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు మువ్వా శ్రీనివాసరావు, రవిమారుత్ ఆనందాచారి, పుప్పాల కృష్ణమూర్తి, రమాదేవి, కులకర్ణి, మూర్తి శ్రీదేవి, విష్ణికలు ఫౌండేషన్ నిర్వహకులు సునంద, బోగోజు ఉపేందర్ రావు, శ్రీనివాస్, తాళ్లూరి లక్ష్మీ, కవులు దేవేంద్ర, కన్నెకంటి వెంకటయ్య, సయ్యద్ షఫీ, పోతగాని సత్యనారాయణ, కొత్తపల్లి శేషు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఐనాల సైదులు, కోండ్రు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బస్‌డిపో రోడ్డు..

- డివైడర్ల తొలగింపుతో మరిన్ని సమస్యలు
- రోడ్డు మధ్యలో గుంతలు
- వాహనదారులకు ఇబ్బందులు



డివైడర్ల తొలగింపుతో రోడ్డుపై పడిన గుంతలు



బస్ డిపో రోడ్డులో పడిన పెద్ద గొయ్యి



ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో..

ఖమ్మం రాపర్తినగర్: నిత్యం వేలాది మంది వాహనదారులు, బస్సులు, ఆటోలు, కార్లు తిరిగే మయూరిసెంటర్ నుంచి రాపర్తినగర్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. డివైడర్లు తొలగించిన తర్వాత అధిక ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనదారులకు అడ్డంగా ఉన్నాయని తొలగించిన డివైడర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో డివైడర్ల మధ్య రోడ్డు మరింత అధ్వానంగా తయారుకావడమే కాకుండా గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ల తొలగింపు కింది దాదాపు రూ.3 లక్షలు మంజూరు చేసిన ఖమ్మం మున్సిపాల్ కార్పొరేషన్ డివైడర్ల పూడ్చివేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అలానే ఉన్నాయి. కేవలం తొలగింపు కొసమే రూ.3 లక్షలు అయ్యాయానే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేగాక ఈ రోడ్డులో ఎక్కడ చూసిన రోడ్డుకు ఇరువైపు గుంతలు అత్యధికంగా దర్శనిమిస్తాయి. దీంతో తరచు బస్ డిపో వెళ్లే దారిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. డివైడర్ల మధ్యలో అప్పట్లో ఏర్పాటు చేసిన కరంటు స్తంభాలు తీయడంతో పెద్ద ఇనుప ముక్కలు పైకి లేవడంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్ డిపోరోడ్డులోని మజీద్, యాకయ్యబార్, కూరగాయ మార్కెట్ దారిల్లో గుంతలు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారినే ఇలా ఉంటే మిగత ప్రాంతాల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక గుంతలు ఏర్పడటంతో వాటిని నింపేందుకు మట్టిని పోస్తున్నారు. మళ్లీ వర్షాలు పడటం, వాహనాలు తిరగడంతో యథాప్రకారంగా గుంతలు ఏర్పడుతున్నాయి. వీటిని శాశ్వతంగా పరిష్కరించాలనే యోచనకు సంబంధిత అధికారులు రాకపోవడం శోచనీయం. గతంలో డివైడర్ల తొలగింపు కోసం కేటాయించిన నిధులతో రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకుంటే బాగుటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.